నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 7 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

జయశంకర్ సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

‘పెట్రోల్ బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి’

సోషల్ మీడియాలో వీడియో వైరల్

చెన్నూర్ టౌన్, ఆగస్టు 6 : చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్ పద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో తూకంలో పెట్రోల్ తక్కువగా వస్తున్నదని, బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరారు. బంక్‌లో మంగళవారం సాయంత్రం ఓ ఉపాధ్యాయుడు అరలీటర్ పెట్రోల్ పోయించుకోగా, 50 ఎంఎల్ తక్కువ వచ్చిందని, ఈ లెక్కన లీటర్‌కు వంద మిల్లీలీటర్ల చొప్పున తక్కువ వస్తున్నదని ఆరోపించాడు. కొలత పాత్రలో పోసిన పెట్రోల్‌ను అక్కడున్న వినియోగదారులకు చూపించారు. కొలతలతో మోసం చేస్తున్న బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

50 ఎంఎల్ తక్కువగా వచ్చినట్లు చూపిస్తున్న వినియోగదారుడు

ఆచార్య జయశంకర్ సేవలు చిరస్మరణీయం

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 6: తెలంగాణ స్వరాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆచార్య జయశంకర్ జయంతిని నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్ రావు, కాసబోయిన సురేశ్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్‌తో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1934లో జన్మించిన జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విశేష కృషి చేశారని తెలిపారు. స్వరాష్ట్ర సాధన కోసం తెలంగాణ ప్రజలను చైతన్య పరిచారని, అందరితో కలిసి సమష్టిగా కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన అందించిన సేవలు ప్రతి ఒక్కరి గుండెల్లో నిలిచిపోయాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

నస్పూర్, ఆగస్టు 6 : తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అందించిన సేవలు మరువలేనివని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జయశంకర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణ రాష్ట్ర కాంక్షతో అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జయశంకర్ సార్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

అన్నం తిందామంటే నీళ్లు లేవు

వంట చేసేందుకూ తిప్పలు

- చేతులు, ప్లేట్లు కడగాలన్నా, టాయిలెట్స్‌కు వెళ్లాలన్నా బయటికి వెళ్తున్న విద్యార్థులు
- బోరు మోటరుకు మరమ్మతు చేయించని అధికారులు
- కొమ్మెరలోని సర్కారు బడిలో నీటి గోస

చెన్నూర్ రూరల్, ఆగస్టు 6: చెన్నూర్ మండలంలోని కొమ్మెర గ్రామంలో ఉన్న జడ్పీ హైస్కూల్‌లో నీటి గోస తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మ ధ్యాహ్నం భోజనం చేసేందుకైనా నీళ్లు లేక తిప్పలు పడుతున్నారు. టాయిలెట్లు, మరుగుదొడ్ల వద్ద నీళ్లు లేక ఇం టికి వెళ్లాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకూ ఫిర్యాదు చేసినా తాగునీటి సమస్య పరిష్కారం కాలేదని విద్యార్థులు తెలిపారు. ఈ పాఠశాలలో 53 మంది విద్యార్థులున్నారు. గత జనవరిలో బోరు మోటరు నుంచి విద్యుత్ మోటర్ చెడిపోయింది. అప్పటి నుంచి అధికారులకు విద్యార్థులు ఎన్నిసార్లు విన్నవించినా మరమ్మతులు చేయించలేదు. 8 నెలలుగా తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇంటి నుంచి వాటర్ బాటిళ్లలో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం తినే ముందు చేతులతో పాటు ప్లేట్లను శుభ్రం చేసుకునేందుకు తిన్న తర్వాత కడిగేందుకు నీళ్లు లేక తిప్పలు పడుతున్నారు. దీంతో పాఠశాలకు 200 మీటర్ల దూరంలో ఉన్న కాలనీలోని బోర్‌వెల్ వద్దకు వెళ్తున్నారు. అక్కడే నీళ్లు తాగి చేతులు, ప్లేట్లను కడుగుతున్నారు. ఆ సమయంలో కరెంటు లేకపోతే మరింత ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు,

పాఠశాలలో పనిచేయని బోరుమోటరు

మరుగుదొడ్లకు వెళ్లేందుకు నీళ్లు లేవు. ముఖ్యంగా విద్యార్థినులు, ఉపాధ్యాయినులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. టాయిలెట్‌కు వెళ్లాలంటే పాఠశాల నుంచి ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది.

ఇంటి వద్దే మధ్యాహ్న భోజనం వంట..

మధ్యాహ్న భోజనం వంట వండేందుకు పాత్రలను కడిగేందుకు నీళ్లు లేకపోవడంతో ఇంటి వద్దే మధ్యాహ్న భోజన కార్మికురాలు వండుతున్నది. ఇంటి వద్ద వండిన తర్వాత భోజనాన్ని ఇంటి నుంచి పాఠశాలలకు తీసుకెళ్లడం, విద్యార్థులకు వడ్డించిన తర్వాత పాత్రలను ఇంటికి మోసుకెళ్లి కడగాల్సి వస్తుందని కార్మికురాలు తెలిపింది.

పాఠశాల బయట ఉన్న కాలనీలోని బోరు వద్దకు వచ్చి చేతులు, ప్లేట్లను కడుగుతున్న విద్యార్థులు

విద్యార్థులపై ఇంత నిర్లక్ష్యమా..?

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించడంలో నిర్లక్ష్యం చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం పాఠశాల బయటికి వచ్చి కాలనీలోని బోరు వద్దకు వస్తున్నారని, వారికి ఏవైనా ప్రమాదాలు జరిగితే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్పెషల్ ఆఫీసర్‌కు విద్యార్థుల వేడుకోలు

పాఠశాలలో కొన్ని నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్యను కొమ్మెర గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ (స్థానిక తహసీల్దార్) మల్లికార్జున్‌కు విద్యార్థులు వివరించారు. టాయిలెట్ల, మరుగుదొడ్ల పరిస్థితులపై వినతి పత్రాన్ని అందించారు. ఈ సమస్యపై పాఠశాల హెచ్ఎంను వివరణ కోరగా ఆయన ఎలాంటి సమాధానం చెప్పలేదు.

మరుగుదొడ్లు లేవు..ఇంటికి పోతున్నాం..

పాఠశాలలో మరుగుదొడ్లకు వెళ్లేందుకు నీళ్ల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. టాయిలెట్ల నుంచి దుర్వాసన వస్తున్నది. మధ్యాహ్న సమయంలో విద్యార్థులకు బహిర్భూమికి వస్తే ఇంటికి వెళ్లి వస్తున్నారు, పాఠశాలలో నీళ్ల లేక పోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. మా బాధలను అర్థం చేసుకొని పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

- అభినయశ్రీ, 7వ తరగతి విద్యార్థిని

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం..

కొమ్మెర హైస్కూల్‌లో కొన్ని నెలలుగా తాగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని తెలుపుతూ విద్యార్థులు వినతి పత్రాన్ని అందించారు. వెంటనే ఈ విషయంపై మిషన్ భగీరథ ఏఈ సరితతో మాట్లాడాను. తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరడం జరిగింది. త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

-మల్లికార్జున్, స్పెషల్ ఆఫీసర్, కొమ్మెర గ్రామ పంచాయతీ

తాగునీటి కష్టాలు తీర్చాలి..

మా పాఠశాలలో మధ్యాహ్న భోజనం సమయంలో చేతులు, భోజనం చేసే ప్లేట్ కడిగేందుకు భోజనం తర్వాత తిన్న ప్లేట్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు నీళ్లు లేవు. పాఠశాల పక్కన వేరే వాళ్లు ఇండ్లకు తాగునీళ్లకోసం వేసుకున్న బోరు వద్దకు వెళ్తున్నాం. ఆ సమయంలో కరెంట్ లేకుంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా నీళ్ల కష్టాలను తీర్చాలని కోరుకుంటున్నాం.

- రోహిత్, 10వ తరగతి విద్యార్థి

పింఛన్ ఇప్పిస్తానని భూమి పట్టా చేసుకున్నడు

పంచాయతీ రాజ్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన

పంచాయతీ రాజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

హాజీపూర్, ఆగస్టు 6 : పింఛన్ ఇప్పిస్తానని చెప్పి పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగి శీలం శ్రీనివాస్ అనే వ్యక్తి మా భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని మా భూమిని మాకు ఇప్పించాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ కార్యాలయం ఎదుట బాధితులు శీలం పోషయ్య, శీలం బాయక్క ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామానికి చెందిన శీలం పోషయ్యకు జన్కాపూర్ శివారులో సర్వే నంబర్ 163/2/2, 165/2/2, 175/2/2లో మూడెకరాల భూమితో పాటు అతని వదిన శీలం బాయక్క పేరున ఉన్న 11 ఎకరాల భూమిని శీలం శ్రీనివాస్ పింఛన్ ఇప్పిస్తానని చెప్పి కన్నెపల్లి తహసీల్ కార్యాలయానికి బాయక్కను తీసుకొని పోయి వేలి ముద్రలు వేయించుకొని తమకు తెలియకుండా అక్రమంగా పట్టా చేయించుకున్నాడని తెలిపారు. ఆ తర్వాత విషయం తెలిసి శ్రీనివాస్‌ను అడిగితే ‘నీ దిక్కున్న కాడ చెప్పుకపో.. ఆ భూమి లోనికి వస్తే చంపేస్తాను’ అని బెదిరిస్తున్నాడని అన్నారు. ఈ విషయంపై జూలై 30న కన్నెపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామని ఇప్పటి వరకు అతనిపై చర్యలు తీసుకోలేదని వాపోయారు.

సమావేశంలో మాట్లాడుతున్న షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

నస్పూర్, ఆగస్టు 6 : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జాతీయ కమిషన్ సంచాలకుడు సునీల్‌కుమార్ బాబు, రీసెర్చ్ అధికారి వర ప్రసాద్, కలెక్టర్ కుమార్ దీపక్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో షెడ్యూల్డ్ కులాల జనాభా 25 శాతం ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ 23 వసతి గృహాల్లో 2078 మందికి వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో 648 మంది ఆశ కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. షెడ్యూల్డ్ కులాల ప్రజల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం బ్యాంకు లింకేజీ ద్వారా రుణా లు అందిస్తున్నదని తెలిపారు. అట్రాసిటీ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎస్సీలకు అందించే సం క్షేమ పథకాలపై అధికారులు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పోలీసులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

సీసీసీ నస్పూర్, ఆగస్టు 6 : జిల్లా పర్యటనలో భాగంగా సీసీసీ సింగరేణి అతిథి గృహానికి వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌కు పలువురు వినతిపత్రాలు అందజేశారు. పాత మంచిర్యాలలోని శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికులకు న్యాయం చేయాలని, యజమానికి మల్కా కొమురయ్య పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. భారతీయ మజ్దూర్ సంఘం జిల్లా కార్యదర్శి మద్దూరి రాజు యాదవ్, కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, కార్యదర్శి నిమ్మరాజుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సగ్గర్తి ఆనందరావు కమిషన్ సభ్యుడి సత్కరించారు.

అట్టముక్కలపైన ఓపీ రాస్తున్న సిస్టర్

అట్టముక్కలే ఓపీ చీటీలు !

మంచిర్యాల జిలా హాజీపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మందులు రాసి ఇచ్చేందుకు ఓపీ చీటీలు కరువయ్యాయి. ఓపీ చీటీల స్థానంలో అట్ట ముక్కలపై వైద్యులు ప్రిస్క్రిప్షన్ రాసి ఇస్తున్నారు. ఈ విషయమై వైద్యురాలిని వివరణ అడుగగా ఓపీ చీటీల విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకపోయాం. జిల్లా కార్యాలయం నుంచి రాగానే వినియోగిస్తామని తెలిపారు. - హాజీపూర్, ఆగస్టు 6



అట్టముక్కపై పేషెంట్‌కు రాసి ఇచ్చిన చీటీ

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

వాంకిడి, ఆగస్టు 6 : అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళ వారం వాంకిడిలోని హనుమాన్ బస్తీలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లపై గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఉండడంతో మొరం వేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఇండ్ల పరిసరాల్లో మురుగునీరు, చెత్తా చెదారం నిల్వతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలకు వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అంతకుముందు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో భిక్షపతి, మండల అధికారులు తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో నస్తులాఖాన్, ఏపీవో ఖాజా అజిజుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 6 : జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణపై వైద్య, పోలీస్, వ్యవసాయ, రెవెన్యూ, ఆబ్కారీ-మధ్య నిషేధ, విద్య, డ్రగ్స్ సంబంధిత శాఖల అధికారులు, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్ రావు, సురేశ్‌తో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై నియంత్రణకు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ పరిధిలో అన్ని గ్రామాల్లో గంజాయి సాగుపై పర్యవేక్షించాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. డ్రగ్స్‌తో కలిగే నష్టాలపై కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థుల అసాధారణ ప్రవర్తనను ఉపాధ్యాయులు గమనించాలని తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 లేదా 14416 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం భట్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడిలోని హనుమాన్ బస్తీ ప్రజలతో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

‘గుండాల’లో దొరకని యువకుడి ఆచూకీ

రెండు రోజులుగా గాలింపు చర్యలు

తిర్యాణి/ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 6: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని రమేశ్ కాలనీకి చెందిన సింగరేణి ఆర్జీ-1 కార్మికుడు సంగే రవి కుమారుడు రిషి ఆదిత్య (18) ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని గుండాల జలపాతంలో సోమవారం గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం నుంచి మంగళవారం రాత్రి వరకు తిర్యాణి పోలీసుల ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో గుండాల గ్రామస్తుల సహాయంతో జలపాతంలో ముమ్మరంగా గాలించినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రిషి ఆదిత్య తన ఐదుగురు స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలపై గుండాలలోని జలపాతం చూసేందుకు వెళ్లాడు. జలపాతం వద్ద సెల్ఫీ దిగుతుండగా అందులో జారి పడిపోయాడు. ఈ విషయం తెలుసుకొని రిషి ఆదిత్య కుటుంబ సభ్యులు సాయంత్రం ఘటన స్థలానికి వెళ్లగా చీకటి కావడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టలేదు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు గజ ఈతగాళ్లతో గాలించినా ఆచూకీ దొరకలేదు. నీటి లోతులో రిషి ఆదిత్య చిక్కుకొని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. రాత్రి కావడంతో తాత్కాలికంగా గాలింపు చర్యలు నిలిపివేసినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. తిరిగి బుధవారం గాలింపు చర్యలు ముమ్మరం చేస్తామని తెలిపారు.

యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు, పోలీసులు

రిషి ఆదిత్య